క్లుప్తంగా

గుల్బర్గా ఉర్సుకు తరలిన భక్తులు



అమరచింత: ఎంతో పవిత్రమైన సయ్యద్ షా ఖాజాబందేనవాజ్ దర్గా షరీఫ్ ఉర్సులో పాల్గొనేందుకు మండలం నుంచి భక్తులు ప్రత్యేక వాహనాల్లో సోమవారం గుల్బర్గా తరలివెళ్లారు. కర్ణాటక రాష్ట్రంలోని గుల్బార్గాలో వెలసిన ఖాజా బందేనవాజ్ ఉర్సు సందర్భంగా ప్రతి ఏడాది ఈప్రాంతం నుంచి భక్తులు తరలివెళ్లి తమ మొక్కులు చెల్లించుకోవడం ఆనాదిగా వస్తున్న ఆచారం. సోమవారం నుంచి ప్రారంభమయ్యే ఉర్సులో గంధం, మంగళవారం తాజేచిరాక్, బుధవారం ఖత్మేఖురాన్ కార్యక్రమాలతో ఉర్సు ముగుస్తుందని భక్తులు తెలిపారు.

అనారోగ్యంతో సర్పంచ్ మృతి



మదనాపురం: మండలంలోని నర్సింగాపురం సర్పంచ్ బక్షి భాగ్యలక్ష్మమ్మ(80) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందారు. ఆమె మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామ అభివృద్ధికి ఆమె చేసిన కృషిని గ్రామస్తులు గుర్తు చేసుకున్నారు. ఆమె మృతికి జిల్లా, మండల ప్రజాప్రతినిధులు, నాయకులు సంతాపం ప్రకటించారు.

విద్యుదాఘాతంతో కోడెదూడ మృతి

పెబ్బేరు: మండలంలోని గుమ్మడంలో విద్యుతాఘాతంతో కోడెదూడ మృతి చెందిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల తెలిపిన వివరాలలో.. గుమ్మడం గ్రామానికి చెందిన బత్తుల శివన్నకు చెందిన కోడదూడ వ్యవసాయ పొలంలో మేత మేస్తున్న క్రమంలో సమీపంలో వేలాడుతున్న విద్యుత్ వైర్ తగిలి విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందినట్లు తెలిపారు. దీంతో సూమారుగా రూ. 30 వేల వరకు నష్టపోయినట్లు రైతు శివన్న తెలిపారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు



అమరచింత: పట్టణానికి చెందిన వివిధ పార్టీల కార్యకర్తలు ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ సాయిచంద్ సమక్షంలో సోమవారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. పట్టణ అధ్యక్షుడు అక్కల నరసింహులుగౌడ్ ఇంటి వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పార్టీలో చేరుతున్న వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. సీఎం కేసీఆర్ పాలనలో ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నుంచి బీఆర్‌ఎస్ పార్టీలోకి చేరుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ ఎస్‌ఏ రాజు, మండల అధ్యక్షుడు రమేష్ ముదిరాజ్, నాగభూషణంగౌడ్, రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

చెరువుల పండుగను ఘనంగా నిర్వహించాలి



పాన్‌గల్: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 8వ తేదీన నిర్వహించే ఊరూరా చెరువుల పండుగను ఘనంగా నిర్వహించాలని మండల ప్రత్యేకాధికారి సురేష్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం సమావేశ మందిరంలో చెరువుల పండుగకు జీపీల వారీగా నియమించిన ప్రత్యేకాధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ చక్రపాణి, ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి, ఎంపీఓ రఘురాములు, పంచాయతీ కార్యదర్శి రఘు పాల్గొన్నారు.

వీపనగండ్ల: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా 8వ తేదీన నిర్వహించనున్న ఊరూరా చెరువుల పండగ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా వ్యవసాయాధికారి సుధాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం కల్వరాలలోని లక్కిరెడ్డి చెరువును ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కతలప్ప, సర్పంచ్ రఘునాథ్‌రెడ్డి, ఆర్‌ఐ కురుమూర్తి, పంచాయితీ కార్యదర్శి కుర్మన్న తదితరులు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 8వ తేదీన నిర్వహించే చెరువుల పండుగను ప్రతి గ్రామంలో ఘనంగా నిర్వహించాలని ఎంపీడీఓ విజయ్‌కుమార్, ఇన్‌చార్జ్ తహసీల్దార్ పరమేశ్వర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఓ మల్లయ్య, ఏపీఎం నాగమణి, ఏఈఓ కబీర్‌దాస్, వ్యవసాయ విస్తరణ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య



తెల్లరాళ్లపల్లిలో తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండల కేంద్రంతో పాటు దొడగుంటపల్లి, అల్వాల గ్రామాల్లో ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరుగుతూ బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. మన ఊరు – మన బడి కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలకు పూర్వ వైభవం తీసుకొచ్చిందని, ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను భోదిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గిరిరాజయ్య, సురేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పాన్‌గల్: బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ తల్లిదండ్రులకు సూచించారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని తెల్లరాళ్లపల్లిలో నిర్వహించిన బడిబాటలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, ఉచిత పాఠ్య, నోట్ పుస్తకాలు, దుస్తులు, భోజనం అందిస్తారని ఆయన తల్లిదండ్రులకు వివరించారు. తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలని కోరారు. బడిఈడు పిల్లలతో పనులు చేయించరాదన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం లక్ష్మణ్‌యాదవ్, ఉపాధ్యాయులు రాందాసు, సీఆర్పీలు గోవింద్, భార్గవి, సంతోష్, రాములు, అశోక్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వీపనగండ్ల: బడిబయట ఉన్న పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే విధంగా ఉపాధ్యాయులు చొరవ చూపాలని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో బడిబాట ర్యాలీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. బడిబయట ఉన్న పిల్లలను గుర్తించి బడిలో చేర్పించడం వల్ల వారికి ఉజ్వల భవిష్యత్ అందించిన వారవుతారని, ఈ విషయంలో గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు, యువత సహకరించాలని ఆయన కోరారు.

అంగన్‌వాడీ ఆధ్వర్యంలో..

పెబ్బేరు: పట్టణ కేంద్రంతో పాటు మండలంలోని కంచిరావుపల్లి అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, ఉచిత భోజనం, దుస్తులు, పాఠ్యపుస్తకాల పంపిణీతో పాటు అన్ని వసతులు కల్పిస్తుందని తమ పిల్లలను పాఠశాలలో చేర్పించాలని అవగాహన కల్పించారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన్న చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రాధమ్మ, ప్రభావతి, విద్యర్థులు పాల్గొన్నారు.



కంచిరావుపల్లిలో..



వీపనగండ్లలో..



దొడగుంటపల్లిలో..

అంగన్‌వాడీలో సామూహిక సీమంతాలు



గర్భిణులకు సీమంతం చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

వీపనగండ్ల: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో సోమవారం గర్భిణులకు సామూహిక సీమంతాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం గర్భిణులకు, కిషోర బాలికలకు పౌష్టికాహారాన్ని అందజేస్తుందని, ఈ ఆహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల వారిలో రోగనిరోధక శక్తి పెరుగుతుందని సెక్టార్ సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణమ్మ అన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుతున్న వైద్య వసతులను వినియోగించుకునే విధంగా అంగన్‌వాడీ టీచర్లు గర్భిణులకు అవగాహన కల్పించాలని ఆమె అన్నారు. పీహెచ్‌సీలో కాన్పులు సురక్షితంగా చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సుగుణాభాయి, సువర్ణ, కమల, ఎల్లమ్మ, ఆయాలు లచ్చమ్మ, ఈశ్వరమ్మ, నీరజ తదితరులు పాల్గొన్నారు.

రూ.లక్ష రుణం మంజూరు చేయాలని వినతి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న ఆరెకటికెలు

వీపనగండ్ల: గ్రామీణ ప్రాంతాల్లో పశువుల చర్మం, మాంసాన్ని విక్రయిస్తూ చర్మకారులుగా గుర్తింపు పొందిన ఆరెకటికెలకు రాష్ట్ర ప్రభుత్వం అందజేయనున్న రూ.లక్ష రుణం అందజేయాలని మండల ఆరెకటికె సంఘం నాయకులు సోమవారం ఎంపీడీఓ కార్యాలయ అధికారి సయ్యద్ అమీర్‌కు ఒక వినతిపత్రం అందజేశారు. కులవృత్తులు చేసుకుంటున్న వారికి రూ.లక్ష రుణాన్ని అందజేస్తామని చెబుతున్న ప్రభుత్వం అధికారులు ఆరెకటికెలను కూడా కులవృత్తుల జాబితాలో వెంటనే చేర్చాలని ఈ సంఘం మండల అధ్యక్షుడు శివాజీ అధికారులకు విజ్ఞప్తి చేశారు. గతంలో గ్రామాల్లో సారా వృత్తిని కొనసాగిస్తూ జీవనాన్ని గడుపుతున్న ఆరెకటికెలు వైన్స్ షాపులు రావడంతో ఆర్థికంగా ఇబ్బందులకు గురయ్యారని, రూ.లక్ష ఆర్థిక సాయాన్ని అందించి ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శంకర్‌జీ, శివాజీరావు, వెంకట్రావు, బాలకృష్ణ, లక్ష్మోజీ, శ్రీను, బాలాజీ, గంగాజీ, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

మిస్సింగ్ కేసు నమోదు

ఆత్మకూర్: మైనర్ కనబడకుండా పోయిన ఘటనలో మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ మహ్మద్‌అంజద్ తెలిపారు. మండలంలోని దేవరపల్లికి చెందిన 17 ఏళ్ల బాలిక మే 25వ తేదీ నుంచి కనబడకుండా పోయిందన్నారు. కుటుంబ సభ్యులు బంధువులు, సన్నిహితుల ఇళ్లల్లో వెతికినా జాడ తెలియలేదని, సోమవారం బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఖబ్రస్తాన్ స్థలాన్ని పరిరక్షించండి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న ముస్లింలు

ఆత్మకూర్: పట్టణంలోని గాంధీచౌక్‌లో ఉన్న పాత ఖబ్రస్తాన్ స్థలాన్ని కబ్జాదారుల పరిరక్షించాలని, కబ్జా చేసేందుకు ప్రయత్నించే వారిపై చర్యలు తీసుకోవాలని ముస్లిం యూత్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట వారు నిరసన తెలిపి కమిషనర్ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. సర్వే నంబర్ 1 లో ఉన్న ఖబరస్తాన్ స్థలాన్ని అక్రమార్కులు కబ్జా చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వందల ఏళ్ల నాటి సమాధులను సైతం ధ్వంసం చేస్తున్నారని, పాలకుల పర్యవేక్షణ కరువైందని, దీనికి తోడు డ్రెయినేజీ మురుగు ఖబరస్తాన్‌లో చేరుతుండడంతో బురదమయంగా మారిందని అసహనం వ్యక్తం చేశారు. వెంటనే డ్రెయినేజీ నిర్మాణం చేపట్టి, కబ్జాకోరులపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనకు పూనుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు మోసీన్, వాహిద్, ఉస్మాన్, అమీర్, వసీం, ఫిరోజ్, జహీర్, అఫ్రోజ్, జుబేర్, అన్సార్ తదితరులు ఉన్నారు.

అక్రమ అరెస్టులు సరికాదు

వనపర్తి టౌన్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీలో నిందితులను కాపాడేందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం కేసును సీబీఐకి అప్పగించకుండా సిట్‌కు అప్పగించారని బీఎస్పీ అసెంబ్లీ నియోజకవర్గం ఇన్‌చార్జ్ చెన్నరాములు నిప్పులు చెరిగారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాస గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. నిరుద్యోగుల తరఫున పోరాడుతూ టీఎస్‌పీఎస్సీని ముట్టడించిన బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, రాష్ట్ర అధికార ప్రతినిధులు, నాయకులు, మహిళలను అక్రమంగా అరెస్టు చేయడం, మహిళ కానిస్టేబుళ్లకు లేకుండా మహిళలపై చేయిచేసుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. లీకేజీ అయిన పరీక్షల్లో ఉత్తీర్ణులైన టాపర్ల లిస్ట్ బయట పెట్టమని ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తే పట్టించుకోకపోవడంతోనే బీఎస్పీ ఆధ్వర్యంలో టీఎస్‌పీఎస్సీని ముట్టడించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు చిరంజీవి, వంశీకృష్ణ, కుర్మయ్య, గంధం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తపై అవగాహన అవసరం



ప్రమాణం చేస్తున్న మహిళలు

వనపర్తి టౌన్: పట్టణంలోని కాలనీలను స్వచ్ఛ కాలనీలుగా తీర్చిదిద్దేందుకు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతో పాటుగా రోడ్లపై చెత్త వేయకుండా ఉండాలని మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ సూచించారు. సోమవారం రాత్రి జిల్లా కేంద్రంలోని 30వ వార్డు జంగిడిపురంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు ఉమ ఆధ్వర్యంలో తడి, పొడి చెత్తను వేరు చేయడం, ఇంట్లోనే కంపోస్ట్ తయారీపై మహిళలను అవగాహన కల్పించారు. దీంతో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు ఆదాయం పొందవచ్చని సూచించారు. ఈ మేరకు శ్రీధర్ మాట్లాడుతూ.. జంగిడిపురం కాలనీలో తడి, పొడి చెత్త వేరు చేసి కంపోస్ట్ తయారు చేయడాన్ని పట్టణ ప్రజలు ఆదర్శంగా తీసుకునేలా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే రాబోయే సీజన్‌లో రోగాల భారీన పడే అవకాశం తగ్గుతుందన్నారు. అనంతరం చెత్త రహిత కాలనీగా తీర్చిదిద్దుకుంటామని ప్రమాణం చేశారు. కార్యక్రమంలో రూప, ప్రేమలత, లక్ష్మి, మాధవి, రాజ్యలక్ష్మి, మన్నెమ్మ, శాంతి, కీర్తన, పావని, అనసూయ, యాదమ్మ, కాలనీ అధ్యక్షుడు కురుమయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూర్‌లో మొక్కలు నాటుతున్న చైర్‌పర్సన్ గాయత్రి

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం..

ఆత్మకూర్: పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని, అందరూ ప్లాస్టిక్ వాడకాన్ని స్వచ్ఛందంగా విరమించుకోవాలని చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ నాగరాజు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవియాదవ్ అన్నారు. సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మున్సిపాలిటీ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. అలాగే ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు చెన్నయ్య, పోషన్న, మండ్లరామకృష్ణ, తబస్సూంమోసీన్, గడ్డమీది శ్రీనివాసులు, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

చెరువు వద్ద పారిశుద్ధ్య పనులు..

దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పరమేశ్వరస్వామి చెరువు పరిసరాల్లో ముమ్మరంగా పారిశుద్ధ్య కార్యక్రమాలను చేపడుతున్నారు. సోమవారం మున్సిపాలిటీ కార్మికులతో కలిసి కమిషనర్ నాగరాజు, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవియాదవ్ పారిశుద్ధ్య పనుల్లో పాల్గొన్నారు.

'ఆశా'ల సమస్యలు పరిష్కరించాలి



తిప్పడంపల్లి పీహెచ్‌సీ వైద్యులకు వినతిపత్రం ఇస్తున్న ఆశాకార్యకర్తలు

వనపర్తి: ఉద్యోగంలో చేరిన ఏళ్ల తర్వాత ఇప్పుడు పరీక్ష నిర్వహించటం సరికాదని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి సునీత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని అర్బన్ హెల్త్ సెంటర్లు, పీపీ యూనిట్, జిల్లా ఆస్పత్రిలో పనిచేస్తున్న ఆశా వర్కర్లు జీజీహెచ్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ జిల్లా నాయకుడు పుట్ట అంజనేయులు ఆశా వర్కర్లకు సంఘీబావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బాలకిష్టమ్మ, పార్వతమ్మ, భాగ్యమ్మ, నారాయణమ్మ, చిట్టెమ్మ, శ్యామల, వినీల, జయమ్మ, కవిత, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోట: గ్రామాల్లో వైద్య సేవలు అందిస్తున్న ఆశా వర్కర్లకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ సోమవారం ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట ఆశావర్కర్లు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి భాగ్య మాట్లాడుతూ.. 18ఏళ్ల పాటు ఆశా కార్యకర్తలు విధులు నిర్వర్తిస్తూ గ్రామాల్లో ప్రజలకు, గర్భిణులకు సేవలందిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఆశా వర్కర్ల కష్టాలను గుర్తించి నెలకు రూ. 18 వేలు కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇటీవల ఆశాలకు ప్రభుత్వం పరీక్ష నిర్వహించి, ఉత్తీర్ణత ఆధారంగా విధుల్లో కొనసాగిస్తాం అని చెప్పడం సరైన పద్ధతి కాదని మండిపడ్డారు. అదేవిధంగా ఆశాలకు యూనిఫాంలు, పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మంజుల, సంతోష, రజిత, చంద్రకళ, వరలక్ష్మి, రేణుక, శ్వేత, గీత, బుచ్చమ్మ, కాంచన, భాగ్యమ్మ, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: ఆశా కార్యకర్తలకు పనిభారం పెరిగిందని, పనికి తగ్గ వేతనం రూ.18వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి శ్రీహరి అన్నారు. సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలతో కలిసి తిప్పడంపల్లిలోని పీహెచ్‌సీ ఎదుట నిరసన తెలిపి వైద్యులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు భారతీయుడు, సత్యమ్మ, నవనీత, ఈశ్వరమ్మ, ఆకాంక్ష, గోపాలమ్మ, సరస్వతి, శ్యామల, రేణుక, పుష్పలత, బాలమ్మ, శోభ, పుష్పబాయి ఉన్నారు.

ఆశాలకు పరీక్ష రద్దు చేయాలి..

పాన్‌గల్: పీహెచ్‌సీల పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఆశా కార్యకర్తలకు నిర్వహించే పరీక్షను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రాము అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీ ఎదుట ఆశా కార్యకర్తలతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎగ్జామ్స్‌లో ఉత్తీర్ణత సాధిస్తేనే ఆశా కార్యకర్తలుగా సర్టిఫికెట్ ఇస్తామని, ఫెయిల్ అయిన వారిని విధుల నుంచి తొలగిస్తామని ప్రభుత్వం చెప్పడం అత్యంత దుర్మార్గమని మండిపడ్డారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని పీహెచ్‌సీ డాక్టర్ హరినాథ్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో రమాదేవి, గోవిందమ్మ, అలివేల, ఎల్లమ్మ, పార్వతి, లలితమ్మ, ఆశమ్మ పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: చాలిచాలనీ వేతనాలతో ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న ఆశా వర్కర్లకు ఖచ్చిత వేతనం ఇవ్వాలంటూ పెద్దమందడి మండలంలో వివిధ గ్రామాలకు చెందిన ఆశా వర్కర్లు సోమవారం పీహెచ్‌సీ ఎదుట నిరసన వ్యక్తం చేసి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఎన్నో ఏళ్లుగా వెట్టిచాకిరీ చేస్తున్న తమకు ప్రభుత్వం పరీక్షలు పెట్టి ఫెయిల్ అయిన వారిని తొలగించాలని చూస్తుందని, ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో గిరిజ, పద్మ, రాధ ఉన్నారు.

మదనాపురం: రాష్ట్ర ప్రభుత్వం ఆశా కార్యకర్తలకు నిర్వహించే పరీక్షలను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బొబ్బిలినిక్సన్ డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ధర్నా చేపట్టి డాక్టర్ భవానీరెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆశా వర్కర్ల యూనియన్ అధ్యక్షురాలు అనసూయ, ప్రధాన కార్యదర్శి నీలమ్మ, గంగా, భాగ్యలక్ష్మి, రేష్మ, మౌలానా, జ్యోతి, బుచ్చమ్మ, భాగ్యరాణి, సలీమా తదితరులు పాల్గొన్నారు.



కొత్తకోట పీహెచ్‌సీ ఎదుట నిరసన తెలుపుతున్న ఆశావర్కర్లు



మదనాపురం పీహెచ్‌సీలో..



వనపర్తి జీజీహెచ్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఆశావర్కర్లు

పీహెచ్‌సీల్లోనే ప్రసవాలు సురక్షితం

పాన్‌గల్: ఆశా కార్యకర్తలు ఆరోగ్య ఉప కేంద్రాల పరిధిలో అందుబాటులో ఉంటూ పీహెచ్‌సీల ద్వారా అందిస్తున్న వైద్య సేవలను ప్రజలకు వివరించాలని పీహెచ్‌సీ డాక్టర్ హరినాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ప్రతి గర్భిణి పీహెచ్‌సీలో కాన్పులు చేయించుకునేలా ఆశా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. పీహెచ్‌సీలో కాన్పులు చేయించుకోవడంతో ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సహకాలను వివరించాలన్నారు. సిబ్బంది విధుల్లో అలసత్వం వహిస్తే శాఖపరమైన చర్యలు తప్పవన్నారు.

వీపనగండ్ల: గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు, వృద్ధులకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుతున్న వైద్య వసతులపై ఏఎన్‌ఎంలు, ఆశాకార్యకర్తలు గ్రామాల్లో పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని వైద్యాధికారి రాజశేఖర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో ఆశాకార్యకర్తలతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుతున్న వైద్య సేవలపై గ్రామీణ ప్రాంతాల ప్రజలకు కొన్ని అపోహలు ఉన్నాయని వాటిని నమ్మకుండా గర్భిణులు, బాలింతలు, ప్రభుత్వ ఆస్పత్రి సేవలను వినియోగించుకోవాలన్నారు.

మున్సిపాలిటీలో ఏరియర్స్ లొల్లి



మున్సిపల్ వైస్‌చైర్మన్, ఆర్‌ఐకి వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

- తొమ్మిది నెలలుగా పెరిగిన వేతనం కోసం ఎదురుచూపులు
- సమస్యను పరిష్కరించకుంటే సమ్మెబాట..

అమరచింత: మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న కార్మికులు తమకు పెరిగిన ఏరియల్స్ ప్రకారం వేతనాలు చెల్లించాలంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ ఆర్‌ఐ కృష్ణయ్యకు సోమవారం వినతిపత్రం అందించారు. తొమ్మిది నెలలుగా తమకు పెరిగిన వేతనాలను చెల్లించడంలో మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్ చొరవ చూపడం లేదని, దీంతో తమ కుటుంబాలు ఆర్థికలితో అలమటించే పరిస్థితుల్లో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తొమ్మిది నెలల ఏరియల్స్‌తో పాటు ప్రస్తుతం రెండు నెలల వేతనాలు సైతం ఇవ్వలేదని వాపోయారు. తమ సమస్యలను పరిష్కరించకపోతే సమ్మె చేస్తామని మున్సిపల్ అధికారులకు ఇచ్చిన వినతిపత్రంలో మున్సిపల్ కార్మికులు పేర్కొన్నారు. వేతనాలు చెల్లించాలని పలుమార్లు విన్నవించినా.. అధికారులు, ప్రజాప్రతినిదులు స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ముదురుతున్న వేతనాల వివాదం..

మున్సిపాలిటిలో ఏడాది నుంచి పారిశుద్ధ్య కార్మికులు, సిబ్బందికి వేతనాలు చెల్లించడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారని కార్మికులు తెలిపారు. 2021లో జీఓ నంబర్ 4 ప్రకారం మున్సిపల్ కార్మికులకు చెల్లించాల్సిన వేతనంతో అదనంగా రూ.వెయ్యి పెంచారన్నారు. అప్పటి నుంచి పెరిగిన ఏరియల్స్‌ను తమకు ఇవ్వాలని కార్మికులు మున్సిపల్ పాలక వర్గానికి విన్నవిస్తున్నా.. తమ సమస్యలను ఆలకించే వారే కరువయ్యారని వానోయారు. వేతనాల సమస్యలను పరిష్కరించక పోతే బుధవారం నుంచి సమ్మె నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఆర్‌ఎస్ రమేష్ తెలిపారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ జీఎస్ గోపికి వినతిపత్రం సమర్పించామని కార్మిక సంఘం నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ప్రేమ్ కుమార్, ప్రభాకర్, కాకి శ్రీను, రాజశేఖర్, నాగరాజు, సునీల్, తిప్పన్న, మహేందర్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.